


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 16-11-2024

సంపుటి: 20 సంచిక: 198

పేజీలు: 4 వెల: రూ.1


# డబ్బులిస్తే.. కుచ్ బీ 'హోతా'



కిల్లిపాలెం ర్యాంపులోకి వెళ్తున్న ప్రొక్లయినర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**పర్యావరణం ఏమైపోయినా ఫర్వాలేదు.. భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు బావురుమంటున్నా పట్టించుకోనక్కర్లేదు.. పంటకు సాగునీరందకపోయినా వచ్చిన నష్టమేమీ లేదు.. మాక్కావాల్సింది ఇసుక. అది అక్రమమో, సక్రమమో అనవసరం. సొమ్ములొస్తున్నాయా, లేదా?! ఇదే కిల్లిపాలెం ర్యాంపులో నడుస్తున్న దందా. గడిచిన కొన్నేళ్లుగా ఇక్కడ అనధికారికంగా ఇసుకను తవ్వుకుపోయి తమ జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని ఇదే కిల్లిపాలెంకు చెందిన కొందరు పోరాడుతుంటే, ఆ గ్రామంలోనే అదే పార్టీకి చెందిన నేతలు యథేచ్ఛగా తవ్వుకుపోతున్నారు.**



స్థానికుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యబృందం

- వద్దన్నచోటే తవ్వుతున్న ఏజెన్సీ
- మైనింగ్, ఆరోగ్యశాఖ రిపోర్టులు బుట్టదాఖలు
- అనుమతులు ఓచోట, తవ్వకాలు కిల్లిపాలెంలో
- హైదరాబాద్ కంపెనీ పేరుతో స్థానిక నేతలు వ్యాపారం
- హ్యూమన్‌రైట్స్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

**రద్దు చేస్తామని.. అనుమతిచ్చారు**

పాము చావకుండా, కర్ర విరగకుండా పని చేయ డమెలాగో మన అధికారులకు తెలిసినంతగా మరొకరికి తెలియదు. డబ్బులిస్తే దొరక్కుండా ఎలా పని చేసిపెట్టాలో తెలిసిన సిద్ధహస్తులు. కిల్లిపాలెం అని కాకుండా, ఆ పంచాయతీలోనే కలెక్టర్ ఆఫీసు వెనుక ప్రాంతంలో తవ్వకాల కోసం హైదరాబాద్‌కు చెందిన హోతా వెంకటేశ్ ప్రాపర్టీస్ పేరిట ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చారు. పేరు వీరిదే కాని, ఇక్కడ స్థానిక టీడీపీ నేతలు ఇసుకను తవ్వుకుంటున్నారు.

తమ ప్రాంతంలో బోరు నుంచి నీరు శాంపిల్ తీస్తే పీహెచ్ లెవెల్స్, ఆక్సిజన్ స్థాయిలు ప్రమాదకరంగా ఉన్నాయని రిపోర్టు రావడంతో గత నెల 21న కలెక్టరును గ్రీవెన్స్‌లో కలిసి సమస్యను విన్నవించారు. దీనిపె స్పందించిన మైనింగ్ డీడీ 23వ తేదీన విచారణ చేశారు. గ్రామంలోని ఇసుక ర్యాంప్‌ని సందర్శించి ఇసుక తవ్వకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ప్రదేశంలో ఎటువంటి ఇసుక మిగలలేదని గుర్తించారు. ఇసుక తవ్వకాలు వల్ల గత కొన్నేళ్లుగా నాగావళి నీటి ప్రవాహం కిల్లిపాలెం వైపుగా కాకుండా నదికి అవతల పొన్నాడ వైపు నుంచి ప్రవహిస్తుంది. దీనివల్ల ఇసుక లభ్యత పూర్తిగా తగ్గిపోయింది. ప్రభుత్వం అనుమతులు ముంజూరుచేసిన ఇసుక ర్యాంప్‌ను నిలిపేయాలని గ్రామస్తులు విన్నవించారు. ఇసుక రీచ్‌ను రద్దు చేస్తామని చెప్పిన వారం రోజులకు వేరేచోట అనుమతులు ఇచ్చి కిల్లిపాలెంలో తవ్వుకోవడానికి జిల్లా ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. దీంతో బాధితులు ప్రభుత్వ అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.



కిల్లిపాలెం రేవులో పాతాళంలో లోతులో ఉన్న గుంతల గూగుల్ మ్యాప్

**యంత్రాలతో ఇసుక తవ్వకాలు**

వైకాపా హయాంలో ఇసుకను తవ్విన కాంట్రాక్టర్ నదిలో ఇసుకతో పాటు మట్టిని తరలించుకుపోయారు. నదీ గర్భంలో పెద్ద పెద్ద గోతులు తవ్వి ఇసుకను, మట్టిని తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక నిల్వలు లేవని మైనింగ్ అధికారులు రిపోర్టు ఇచ్చినా తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చారు. హైదరాబాద్ ఏజెన్సీ పేరిట అగ్రిమెంట్ ఉన్నా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఇద్దరు నదిలో జేసీబీలు, ప్రొక్లెయినర్స్‌ను దించి ఇసుకను - మిగతా 4లో

# అలిగిన వేళనే చూడాలి..!




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- **ఆమదాలవలస నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జిను మార్చిన తర్వాత ఆ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు తమ్మినేని సీతారామ్ రెండు రోజుల నుంచి నియోజకవర్గంలో వైకాపా నాయకులతో చర్చలు జరుపుతున్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో ఉన్న వైకాపా నేతలతో ఆయన మంతనాలు జరిపిన తర్వాత శనివారం నుంచి మిగిలిన మూడు మండలాల కేడర్‌తో మాట్లాడుతున్నారు.**
- **సరుబుజ్జిలి మాజీ ఎంపీపీ కిల్లి వెంకట సత్యనారాయణ తన కుమారుడితో కలిసి వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఈయనకు రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్టు భోగట్టా. అంతేకాకుండా ఆమదాలవలస నియోజకవర్గంతో పాటు జిల్లాలో కళింగ సామాజికవర్గం మీద ప్రభావం చూపే విధంగా వ్యవహరించాలని సలహా ఇచ్చినట్లు తెలుస్తుంది.**

- ✔ కేడర్‌తో సీతారామ్ వరుస సమావేశాలు
- ✔ రాష్ట్ర కార్యదర్శిగా కిల్లి సత్యనారాయణ
- ✔ అలకో, అసంతృప్తో బయటపడని మాజీ స్పీకర్
- ✔ జనసేనలో చేరుతారని ప్రచారం

విడివిడిగా చూస్తే ఈ రెండూ రెండు వార్తలు. ఒకదానికొకటి సంబంధం ఉందా..? అంటే ఉంది. లేదూ అంటే లేదు. కానీ జమిలీ ఎన్నికలు వస్తాయని భావిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాపై దృష్టి సారించారు. అందుకే సీతారామ్‌ను పార్లమెంట్‌కు పంపించి, అక్కడ చింతాడ రవికుమార్‌కు అవకాశం ఇస్తున్నట్టు పార్టీ తరఫున ప్రకటించారు. అయితే సీతారామ్ అంత తేలిగ్గా అసెంబ్లీ స్థానాన్ని విడిచిపెడతారంటే ఆయన్ను ఎరిగిన రాజకీయ నాయకులెవరూ నమ్మడం లేదు. జగన్ వ్యవహార శైలి తెలిసినవారు ఆయన నిర్ణయంలో మరి మార్పు ఉండదని చెబుతున్నారు. ఇప్పుడు ఆమదాలవలస నియోజకవర్గంలో ఏం జరుగుతోందనేదే సర్వత్రా ఉత్కంఠ రేపుతున్న ప్రశ్న. తన తర్వాత రాజకీయ వారసుడిగా కుమారుడు చిరంజీవి నాగ్‌ను నిలబెట్టాలని సీతారామ్ ఎప్పట్నుంచో భావిస్తున్నారు. తాను పార్లమెంట్‌కు వెళ్లాలంటే కొడుకుకు అసెంబ్లీ సీటు ఇవ్వాలని గత ఎన్నికల్లోనే సీతారామ్ జగన్మోహన్‌రెడ్డిని కోరారు. అది కుదిరే పని కాదనే మళ్లీ సీతారామ్‌కే టిక్కెటిచ్చారు. అయితే ఈసారి జగన్మోహన్‌రెడ్డి మొహమాటాలకు పోరని తెలుస్తుంది. తనకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించిన తర్వాత సీతారామ్‌ను కలిసి చింతాడ రవికుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా వైకాపా అధికార పత్రికలో వెలువడిన ఫొటోను చూసిన వైకాపా నేతలు సీతారామ్ ఎలా స్పందించివుంటారో చర్చించుకుంటున్నారు. ఎందుకంటే.. ఆ ఫొటోలో ఎక్కడా సీతారామ్ మోములో నవ్వు కనిపించలేదు. అలాగే సాక్షి సీతారామ్ చింతాడను అభినందించినట్టు కూడా రాయలేదు. అక్కడికి రెండు రోజుల వ్యవధిలో సీతారామ్ నియోజకవర్గంలో వైకాపా నాయకులతో సమావేశమవుతున్నారు. ఎక్కడా తాను అసెంబ్లీకే వెళ్తానని, ఏ సమయంలోనైనా మార్పు ఉంటుందని ప్రస్తావించడం లేదు. అలా అని పార్టీ ఆదేశాల మేరకు పార్లమెంట్‌కు పోటీ చేస్తానని, ఆమదాలవలసలో రవికుమార్ ఉంటాడని కూడా కేడర్‌కు చెప్పడం లేదు. సో.. ఇప్పుడు సీతారామ్ ఏం చేస్తారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. కనీస ముందస్తు సమాచారం లేకుండా, జిల్లా పార్టీ అధ్యక్షుడికి సైతం చెప్పకుండా వైకాపా ఆమదాలవలస అసెంబ్లీ ఇన్‌ఛార్జిని మార్చింది. సహజంగానే అప్పటి వరకు ఇన్‌ఛార్జిగా ఉన్న నాయకుడికి అసహనం ఉంటుంది. ప్రస్తుతం సీతారామ్‌లో ఉన్నది అదేనా? లేదూ అంటే.. మరో ఆలోచన ఉందా? అనేది స్పష్టం కావడంలేదు. నియోజకవర్గ వైకాపా నేతలతో మాట్లాడినప్పుడు కూడా ఎక్కడా సీతారామ్ పరోక్ష సంకేతాలు ఇవ్వడంలేదు. కానీ, సీతారామ్ గత చరిత్రను దృష్టిలో పెట్టుకొని ఆయన పార్టీ మారుతారన్న సందేహాలే ఇప్పుడు చాలాచోట్ల వ్యక్తమవుతున్నాయి. చివరి నిమిషం వరకు బయటపడకపోవడం సీతారామ్ లక్షణమని 2007లో ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లేవరకు సీతారామ్ పార్టీ మారుతారని ఎవరికీ ఉప్పందించలేదు. నేరుగా



హైదరాబాద్‌లో చిరంజీవి పక్కన కనిపించేవరకు ఆయన టీడీపీని వీడుతారని ఎవరూ భావించలేకపోయారు.

ఎందుకంటే.. అంతకు ముందే తాను చనిపోతే, మృతదేహం మీద తెలుగుదేశం జెండాయే ఉంటుందని సీతారామ్ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. అటువంటి సీతారామ్ ఆకస్మికంగా పీఆర్పీలోకి వెళ్లి, 2009 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మళ్లీ టీడీపీకి వచ్చారు. టీడీపీలో టిక్కెట్ రాదని తెలుసుకున్నాక అట్నుంచటే వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. కాబట్టి ఇప్పుడు ఏమైనా జనసేనలోకి వెళ్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కూడా ఈ మేరకే ఆలోచిస్తున్నట్టు తెలుస్తుంది. అందుకే సరుబుజ్జిలి మాజీ ఎంపీపీ కిల్లి వెంకట సత్యనారాయణను జగన్మోహన్‌రెడ్డి పిలిపించుకొని రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చినట్లు భావిస్తున్నారు. పురుషోత్తపురానికి చెందిన కిల్లి వెంకట సత్యనారాయణకు ఆమదాలవలస నియోజకవర్గం మీద పట్టుంది. అంతేకాకుండా వివాదరహితుడు. ఇటు ధర్మాన ప్రసాదరావు కోటరీలోను, అటు సీతారామ్ ఆంతరంగికుడిగాను మెసులుతున్న ఏకైక ఆమదాలవలస నియోజకవర్గ నేత కిల్లి సత్యనారాయణే. సీతారామ్ పార్టీ మారితే నియోజకవర్గంలో అసెంబ్లీ సీటుకు డ్యామేజ్ లేకుండా ముందుగానే కిల్లిని క్లియర్ చేసి పెట్టుకున్నారని భావిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను సముచిత స్థానంలో నిలుపుతారని జగన్మోహన్‌రెడ్డి మాటిచ్చారనే టాక్ నడుస్తోంది. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే సీతారామ్ అసెంబ్లీకి వెళ్తే కచ్చితంగా మంత్రి అవుతారనే ఒక ఆశ ఉంటుంది. అటువంటిది ఇప్పుడు ఎంపీగా పోటీ చేసి ఏమీ చేయలేమన్న అసహాయత వల్ల సమావశాలు పెట్టుకుంటే తప్పులేదు కానీ, పార్టీ మారితే సరికాదనే భావనలో అక్కడి పార్టీ కేడర్ ఉన్నారు.

## తమ్ముడి ఫిర్యాదుతో..

# అన్న మృతదేహానికి పోస్టుమార్టం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

సెప్టెంబర్ 18న చెరువులో పడి మృతిచెందిన గూడెం గ్రామానికి చెందిన బొంతల కరువోడు(79) మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ నరసన్నపేట మండలం కామేశ్వరిపేటకు చెందిన మృతుని తమ్ముడు బొంతల వాకయ్య శ్రీకాకుళం రూరల్ పోలీసులకు రెండు రోజుల క్రితం ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి శనివారం గూడెం స్మశాన వాటికలో పూడ్చిపెట్టిన కరువోడు మృతదేహాన్ని బయటకు తీసి, తహసీల్దార్ గణపతి, రిమ్స్ వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామస్తులు చెబుతున్న ప్రకారం చెరువులో పడిపోయిన కరువోడు భార్య తరపు బంధువులు అంతిమ సంస్కరణలు పూర్తి చేసినట్టు తెలిసింది. కరువోడు కూలి పనులు చేసుకుంటూ భార్య మృతి చెందడంతో ఒంటరిగానే జీవనం సాగిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే చెరువులో కాలు జారీ కరువోడు మృతి చెందినట్టు గుర్తించిన తర్వాత బంధువులు అంతిమ సంస్కరణ పూర్తిచేశారు. దీనిపై మృతుడి తమ్ముడు వాకయ్య అనుమానాస్పద మృతిగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు, కరువోడు బంధువులను విచారించిన తర్వాత కేసు పూర్వపరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

# వీరసైనికునికి ఘనవీడ్కోలు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఈ నెల 16న మృతిచెందిన లాన్స్ నాయక్ మొదలవలస చిన్నారావు పార్థివ దేహం జిల్లాకు చేరింది. ఫరీద్‌పేటలోకి అడుగుపెట్టే ముందు భారీర్యాలీగా పుర ప్రజలు, స్థానిక యువత, మాజీ సైనికులు హైవే నుంచి గ్రామంలోని లాన్స్ నాయక్ స్వగృహం వరకు భారత మాతాకి జై, అమర్ రహే అమర్ రహే చిన్నారావు అనే నినాదాలు చేశారు. మిలిటరీ పారాంపర్యాలకనుగుణంగా నేషనల్ ఫ్లాగ్‌ను లాన్స్ నాయక్ తల్లి, భార్యకు అందించారు. అనంతం స్థానిక ఎక్స్ సర్వీస్‌మెన్‌లు తమ గౌరవ వందనాన్ని అందించారు. ఆ తర్వాత లోకల్ పోలీసులు గౌరవ వందనాన్ని అందించి గార్డ్ అఫ్ హానర్ చేశారు. గాలిలో మూడు రౌండ్స్ ఫైర్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్. రామకృష్ణ, కోశాధికారి ఎం.సింహాచలం, జాయింట్ సెక్రటరీ పైడి రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ రాంబాబు, వాసుదేవరావు, జి.రామారావు, పైడి నాగేశ్వరరావు, ఫరీద్‌పేట మాజీ సైనికుల యూనియన్ అధ్యక్షులు అప్పన్న, సెక్రటరీ నారాయణమూర్తి, వి.ఈశ్వరరావు, ఎస్.పి.రావు, అమ్మాజీరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

## కెరీర్ కన్నా క్యారెక్టర్ ముఖ్యం..!

బాల్యాన్ని ప్రేమించడం మానవీయ సంస్కృతికి నిదర్శనం. 140 కోట్లకు పైగా జనాభా వున్న మన దేశంలో ముప్పై సంవత్సరాల లోపువారు 60 శాతం మంది. అందుకే మన దేశాన్ని యంగ్ ఇండియా (యువభారత్) అని అంటున్నారు. అంటే 84 కోట్ల మంది. వారిలో 50 శాతం మంది (3 - 18 సంవత్సరాల మధ్యవారు) బడి వయసు పిల్లలు. అంటే 42 కోట్ల మంది. నాణ్యమైన విద్యకు మన విద్యార్థులు దూరమవుతున్న విషయం అందరూ ఎరిగిందే. ఇంటికన్నా బడిపదిలం నుంచి సర్కారు బడికన్నా కార్పొరేట్ బడే పదిలం, అందుకోలేనివారికి బడి బయటే పదిలం అనే విధంగా పరిస్థితులు దిగజారుతున్నాయి. ఫలితంగా ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు బడిబాటకు దూరమవుతున్నారు. యునెసెఫ్ పేర్కొన్నట్టు బడిబయట వున్న బాలలందరూ బాలకార్మికులే. ఈ 42 కోట్లమందిలో మూడవ వంతుమంది అంటే దాదాపు 14 కోట్ల మంది బడి ముఖ్యం చూడని, లేదా బడి మధ్యలో చదువు ఆపేసిన బాలలే. ఐదేళ్ల లోపు బాలలు 40 శాతం మంది కనీస పోషక విలువల లేమితో బాధపడుతున్నారని, వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేక కునారిల్లుతున్నారని సర్వేలు తెలుపుతున్నాయి. ఆధునిక యుగంలో వ్యక్తిగత అభివృద్ధికి పర్యాయపదం చదువు. 'విలువలతో కూడిన విద్యే నిజమైన విద్య' అని అంబేద్కర్ పదే పదే చెప్తారు. మరి మన విద్యావ్యవస్థ ఎలాంటి సామాజిక, మానవీయ, శాస్త్రీయ విలువలు బాలలకు అందిస్తున్నదో మనం గమనించుకోవాలి. చదువుకు ఎల్లలు లేవని, బాలలందరూ సమానమేనన్న సత్యాన్ని చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. దాదాపు మూడో వంతు బాల్యం ఈ విధంగా బాధపడుతుంటే మన దేశం ఎలా ముందుకు పోగలదు? ఈ విషాదాన్ని మనం ఎలా నైతికంగా సమర్థించుకోగలం? వ్యక్తిగతంగా పైకి ఎగబాకాలనే ర్యాట్‌రేస్ ఒత్తిడిలో విద్యార్థులు బలవన్మరణాల పాలవుతున్నారు. ఇది బాల్యానికి మరో పార్శ్వం. విద్యార్థుల ఆత్మహత్యల్లో తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ముందు వరుసలో వున్నాయి. చదువులా? చావులా? అన్న పతాక శీర్షికలు ప్రతికలకు ఎక్కుతున్నాయి. ఈ కార్పొరేట్ విద్యాసంస్కృతికి ఆశపడి ఎంతోమంది బడుగు జీవులు తమ పిల్లల భవిష్యత్ కోసం అప్పుల పాలవుతూ పల్లెలు వదలి పట్టణాలకు వస్తున్నారు. చేతగాని పనులు ఎన్నో చేస్తూ నరకయాతన పడుతున్నారు. ఇంటర్ విద్య ఖర్చు 5- 10 లక్షల రూపాయల వరకు వుంటే వారి ఆస్తులు, ఆదాయం హరతి కర్పూరంలా హరించుకుపోతున్నాయి. దుర్భరమైన ఈ తల్లిదండ్రుల కష్టం కూడా పిల్లలపై అధిక మానసిక ఒత్తిడిని పెంచుతున్నది. చదువుకు తగిన ఉద్యోగం రాకపోయినా, చదువు అబ్బకపోయినా కాయకష్టం చేసుకుని నిజాయితీగా, హాయిగా బతకవచ్చు అనే ఆత్మస్థైర్యం కొరవడింది. ఉపాధ్యాయులు ఆకర్షణీయ బోధనాపద్ధతులు మెరుగుపరుచుకోలేక పిల్లలకు పాఠ్యాంశాలపై శ్రద్ధ లేక తరగతి గదులు నిస్సారమైపోతున్నాయి. చదువు కేవలం మార్కుల కోసమే అన్న పద్ధతుల్లో గైడ్‌లు ఇచ్చి పిల్లల చేత బట్టీ పట్టిస్తూ, చూచిరాతలు రాయిస్తున్నారు. యాంత్రికంగా మారుతున్న చదువు పట్ల ఎవరూ సిగ్గుపడటం లేదు. తల్లిదండ్రులు కూడా ఆ మార్కులు, ర్యాంకుల పట్ల పరుగుతీయడం శోచనీయం. పులిమీద పుట్రలా ఇప్పుడు బాల్యంపై డ్రగ్ (మత్తుపదార్థాల) పంజా కూడా విప్పింది. ఈ యంగ్ ఇండియాను డ్రగ్ ఇండియాగా మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం రెండు లక్షల మంది డ్రగ్ వాడకందార్లు వుంటే, ఇప్పుడు ఆ సంఖ్య పదికోట్లకు చేరినట్లు చెబుతున్నారు. ఈ డ్రగ్స్ ఇప్పుడు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు దాటుకుని పాఠశాలలకు చాక్లెట్స్ రూపంలో చేరడం పెనువిషాదం. అలాగే సెల్‌ఫోన్ వాడకం విశృంఖలత్వంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, బ్లూవేల్స్ వంటి ప్రమాదకర వీడియోగేమ్స్, హద్దూ అదుపూ లేని పోర్న్‌కల్చర్‌కు బానిసలవుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఈ ప్రమాదకర విషపు సాలెగూడులో బాల్యం చిక్కుకుంటున్నది. లైంగిక విశృంఖలతో నేరాలకు, ట్రాఫికింగ్‌కు బాల్యం బలైపోతున్నది. వీటన్నిటి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం క్షమించరానిది. ఈ నేపథ్యంలో బాల్యాన్ని పరిరక్షించేందుకు కేవలం ప్రభుత్వాలపైనే ఆధారపడక ఎక్కడికక్కడ పౌరసమాజం మేల్కొని ఉద్యమంలా కదలాలి. తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకునే విధంగా పిల్లలకు శిక్షణనీయాలి. కెరీర్ కన్నా క్యారెక్టర్ ముఖ్యమన్న పద్ధతుల్లో విద్యాబోధన సాగాలి. శ్రమను గౌరవించడం (డిగ్నిటీ ఆఫ్ లేబర్), ప్రశ్నించడం నేర్పాలి. మానవులందరూ సమానమేనన్న సమతా ధర్మాన్ని పాటించేలా చేయాలి. బాల్యం భవిష్యత్తులోనే దేశ భవిష్యత్తు దాగి వుందన్న సత్యాన్ని తెలుసుకోవాలి. అలాంటి శాస్త్రీయ విద్యకు బాటలు పరిచినప్పుడే మనదేశానికి పురోగతి వుంటుంది.



ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌లోని ఓ గ్రామానికి చెందిన ఓ సాధారణ అమ్మాయి. దగ్గరి బంధువు ఆమె రంగుల కలలపై నీడను కమ్మేశాడు. 2012లో లలితా బెన్ అనే బాలికపై ఆమె బంధువు యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. దాడిలో ముఖం పూర్తిగా వికటించిన లలిత 17 సర్జరీల తర్వాత మళ్లీ బతికింది. అప్పుడు కూడా ఆ ముఖంలో ఎవరూ చెరిపేయలేని మచ్చలు మిగిలాయి.

## మనసు చూసి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు!

**- జీవితం మార్చేసిన ఫోన్ కాల్! - డిజైనర్లు అబు జానీ, సందీప్ ఖోస్లా ముస్తాబు**
**- పెళ్లి కానుకగా ఇల్లు ఇచ్చిన వివేక్ ఒబెరాయ్**

తర్వాత జీవితంలో ఈ అమ్మాయి ఇతరుల నుంచి ఎగతాళి, అవహేళనలకు గురైంది. అయితే కొత్త నివాసం నుంచి స్నేహితురాలికి ఫోన్ చేస్తూ చేసిన చిన్న పొరపాటు లలిత జీవితాన్ని మార్చేసింది. రాహుల్ కుమార్ అనే యువకుడు తన స్నేహితుడి ఫోన్ నెంబర్‌ను తప్పుగా డయల్ చేయడంతో అతనికి కాల్ వచ్చింది. సంబంధిత కాల్ సంభాషణ పరిచయంగా మారింది. అనతికాలంలోనే ఇద్దరూ ప్రేమలో పడ్డారు. యాసిడ్‌తో కాలిపోయిన జీవితంలో.. ఆమె కథలన్నీ విన్న రాహుల్, తాను లలితను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నట్లు తెలియజేశాడు. కొన్ని నెలల ప్రేమ గత నెలలో నిజమైంది. వందలాది మందిని సాక్షులుగా చూపుతూ రాహుల్ లలిత మెడలో తాళి కట్టాడు. ప్రేమను అందంలో మాత్రమే చూసే సమాజానికి ఇది కూడా సవాలుగా మారింది. ఒక అమ్మాయి జీవితం.. ఆమె వాయిస్ వినడం నాకు చాలా నచ్చిందని రాహుల్ అన్నారు. "చాలామంది ముఖ సౌందర్యం చూసి పెళ్లి చేసుకుంటారు. చివరికి విడిపోతుంది. ఆమె ముఖంపై నాకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. లలిత మంచి వ్యక్తి. ఆమె నా జీవితాంతం నాతో ఉండాలని కోరుకుంటున్నాను" అని రాహుల్ చెప్పాడు. బాలీవుడ్ సెలబ్రిటీలతో సహా పలువురు ప్రముఖులు తమ జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజును చూసేందుకు వచ్చారు. యాసిడ్ దాడి బాధితుల కోసం జరిగిన కార్యక్రమంలో లలితను కలిసిన నటుడు వివేక్ ఒబెరాయ్ పెళ్లి కానుకగా వారిద్దరికీ ఇల్లు కట్టించాడు. వధువును ప్రముఖ డిజైనర్లు అబు జానీ, సందీప్ ఖోస్లా ముస్తాబు చేశారు. లలితకు పెళ్లి దుస్తులను, నెక్లెస్‌ను బహుమతిగా ఇచ్చారు. జీవితం కథ కంటే ఉద్వేగభరితమైనప్పుడు.. 'జీవితం ఒక అద్భుతం. మీరు ఎప్పుడూ ఊహించనిది మీ కోసం ఎల్లప్పుడూ నిల్వ ఉంచుతుంది.'

**- సత్యం ఐటీడెస్క్**

### జనావాసాల్లో
## భారీ కంటైనర్లు..!
### - చోద్యం చూస్తున్న పోలీసులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళాశాల, పాఠశాలలతో అత్యంత రద్దీగా ఉండే శ్రీకాకుళం పట్టణం న్యూ కాలనీలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఒక పక్క భారీ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, మరోపక్క గోడౌన్ల వద్ద లోడింగ్, అన్ లోడింగులు స్థానికులకు ప్రాణసంకటంగా మారింది. స్థానికులు గత పేదళ్లుగా ఈ సమస్యతో సతమతమవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదానికి గురికావలసి వస్తుందోనని భయపడుతున్నారు. అందుకు శుక్రవారం జరిగిన సంఘటనే ఉదాహరణగా నిలుస్తుంది. ఆర్కే పైపుల వారు న్యూకాలనీ క్రాంతి నెస్ట్ అపార్ట్‌మెంట్ ఎదురుగా రద్దీ సమయంలో ఉదయం పదిన్నర గంటలకు అన్‌లోడింగ్ చేస్తున్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిపై ఒక్కసారిగా 20 అడుగులు భారీ పైపులు దొర్లి మీద పడ్డాయి. దీనితో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు డాక్టర్ అమ్మన్నాయుడు ఆసుపత్రికి తరలించారు. అతని వాహనం కూడా పూర్తిగా దెబ్బతింది. అంత రద్దీగా వాహనలు తిరిగే రోడ్డులో పైపులను, ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఎలా కట్లువిప్పుతారు. అలా విప్పినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి కదా? అలా చేయకుండా ఒక్కసారి పైపులు స్కూల్ పిల్లలపై పడితే.. ప్రాణాలతో బయట పడగలరా అని జిల్లా ప్రజా సమస్యల వేదిక అధ్యక్షులు బీవీ రవిశంకర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు న్యూకాలనీలో ఇలాంటి ప్రమాదాలకు కారణమయ్యే గోడౌన్లను తొలగించాలని కోరారు. అలాగే భారీ వాహనాలు ఈ రెసిడెన్షియల్ ప్రాంతాల్లో లేకుండా చూడాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు.







ఈ కథ అంతా ఒక పిల్లాడి చుట్టూ తిరుగుతుంది. ఆ పిల్లాడి తండ్రి హీరో చేతిలో చనిపోతాడు. కానీ అతను చనిపోవడానికి సరైన కారణమే ఉంటుంది. ఐతే ఆ పిల్లాడు హీరోను ద్వేషిస్తాడు. ఈ ఎమోషన్ మీదే కథంతా నడుస్తుంది. కానీ హీరో చేసిన దాంట్లో తప్పు కనిపించదు. ప్రమాదంలో ఉన్న ఆ పిల్లాడిని కాపాడ్డానికి హీరో చేసే సాహసంలో బలమైన ఎమోషన్ ఉండదు. ఇక హీరోకు.. విలన్‌కు మధ్య శత్రుత్వం ఏర్పడేలా బలమైన సన్నివేశాలు రాసుకోవడంలో దర్శకుడు శివ విఫలమయ్యాడు. బాబీ డియోల్ చేసిన విలన్ పాత్ర లుక్స్ పరంగా వయొలెంట్‌గా కనిపిస్తుంది కానీ.. విషయ పరంగా అది భీకరంగా ఏమీ అనిపించదు. హీరో-విలన్ మధ్య వైరంలో బలమైన కాన్ఫ్లిక్ట్ పాయింటే కనిపించకపోవడం సినిమాకు పెద్ద మైనస్. విదేశీ సైన్యం రెండు తెగల మధ్య చిచ్చు పెట్టే విషయాన్ని కూడా బలంగా చూపించలేకపోయారు.

**కథ:**

1900 ఏళ్ల కిందట భారత దేశానికి సరిహద్దుల్లో అయిదు తెగలకు చెందిన మనుషులు.. వేర్వేరుగా ఆవాసాలు ఏర్పాటు చేసుకుని బతుకుతుంటారు. ఆ ఐదు తెగలకు తమకంటూ ప్రత్యేకమైన లక్షణాలు.. సంప్రదాయాలు ఉంటాయి. వీటిలో ప్రణవాది కోన ప్రత్యేకం. వారిలో వీరత్వమే కాక మంచి లక్షణాలూ ఉంటాయి. ఈ తెగకు నాయకత్వం వహిస్తుంటాడు కంగువ (సూర్య). ఐతే రొమేనియాకు చెందిన సైన్యం భారత దేశాన్ని చేజిక్కించుకునే లక్ష్యంతో సముద్రం ద్వారా సరిహద్దులకు వచ్చి తమ స్థావరం ఏర్పాటు చేయడానికి ఈ ఐదు కోనల్లో ఒకదాన్ని నాశనం చేయాలనుకుంటుంది. ప్రణవాది కోన మీద ఆ సైన్యం దృష్టిపడి.. ఆ కోనను అంతం చేసేందుకు కపాల కోనకు చెందిన నాయకుడు రుధిరతో చేతులు కలుపుతుంది. దీంతో ఆ రెండు కోనల మధ్య వైరం మొదలై యుద్ధానికి దారి తీస్తుంది. మరి ఈ పోరులో ఎవరు గెలిచారు.. అన్నది మిగతా కథ.

## మురిపించని మరో ప్రపంచం!

**కథనం-విశ్లేషణ:**

'బాహుబలి: ది కంక్లూజన్'లో భల్లాల దేవుడి కోటలోకి తన సైన్యంతో ఎలా అడుగు పెట్టాలా అని ఆలోచించిన మహేంద్ర బాహుబలి.. తాటిచెట్లను విల్లులాగా వంచి వాటి ద్వారా తన సైన్యాన్ని కోటలోకి చేర్చే ఒక సన్నివేశం ఉంటుంది. నిటారుగా ఉండే తాటి చెట్టును అలా వంచడం అన్నది అసాధ్యమైన విషయం. ఐతే ఫిజిక్స్ సూత్రాల్లో అస్సలు ఇమడని ఈ సీన్ చూసి ప్రేక్షకులు ఇదేం లాజిక్ అనుకోరు. సినిమాలో లీనం అయిపోయినపుడు.. అందులోని ఎమోషన్ కు కనెక్ట్ అయినపుడు.. ఇలాంటి లాజిక్ కు అందని విషయాలు కూడా గమ్మత్తుగా అనిపిస్తాయి. కానీ సినిమా ప్రేక్షకులను లీనం చేయనపుడు.. అందులోని ఎమోషన్ వర్కవుట్ కానపుడు.. ప్రతిదీ విడ్డూరంగా అనిపించి లాజిక్కులు వెతకాలనిపిస్తుంది. తమిళ సినిమాకు 'బాహుబలి' కాగలదనే అంచనాలున్న 'కంగువ' చూస్తున్నపుడు చాలా చోట్ల ఇలాంటి ఫీలింగే కలిగితే ఆశ్చర్యం లేదు. నీటిలో వెయ్యేనుగుల బలం ఉంటుందని చెప్పే మొసలిని హీరో అలవోకగా చిన్న కత్తి పుచ్చుకుని చంపేస్తుంటే.. కారడవిలో వందల మంది శత్రు సైన్యాన్ని సునాయాసంగా మట్టు పెడుతుంటే.. ఆకాశం నడి మధ్యలో వార్ ప్లేన్ నుంచి వేలాడుతున్న వాడు వెనక్కి వచ్చి అందులో ఉన్న వాళ్లందరినీ అంతం చేస్తుంటే.. ఆ సన్నివేశాలు వెటకారంగా అనిపిస్తాయంటే అందుక్కారణం.. 'కంగువ' కథకు.. అందులోని ఎమోషన్ కు ప్రేక్షకులు కనెక్ట్ కాకపోవడం వల్లే. ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి థ్రిల్ చేయడానికి శివ అండ్ టీం చాలానే కష్టపడింది కానీ.. ఆ ప్రపంచంలో ప్రేక్షకులను కుదురుగా కూర్చోబెట్టి విహరింపజేయడంలో మాత్రం విఫలమైంది. సెట్టింగ్స్.. స్పెషల్ ఎఫెక్ట్స్ ద్వారా ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించి.. నటీనటుల వేషధారణలు మార్చి.. భాష-యాసలోనూ వైవిధ్యం చూపించి.. విజువల్ గ్రాండియర్ కూడా జోడించి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచడం ద్వారా బాక్సాఫీస్ ను కొల్లగొట్టడం ఇప్పుడు ట్రెండ్. 'బాహుబలి'తో ఊపందుకున్న ఈ ట్రెండును చాలా సినిమాలు అనుసరించాయి. కానీ అన్ని చిత్రాలూ ప్రేక్షకులకు రసానుభూతిని కలిగించలేకపోయాయి. 'కంగువ' టీం ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వడానికి చాలా కష్టపడిన మాట వాస్తవం. 1900 ఏళ్ల వెనక్కి వెళ్లి తెగలు.. కోనలు అంటూ డిఫరెంట్ సెటప్ తో కథ రాసుకున్నాడు శివ. విజువల్‌గా ప్రేక్షకులను మరో లోకంలోకి తీసుకెళ్లేలా ఈ సెటప్ బాగానే కుదిరింది. సూర్య-బాబీ డియోల్ లాంటి అదిరిపోయే స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న హీరో-విలన్ ను ఎంచుకోవడమూ బాగుంది. కానీ సెటప్ అంతా డిఫరెంటుగా అనిపించినా.. కథ కొత్తగా లేకపోవడం.. ప్రేక్షకులను ఇన్వాల్వ్ చేసే బలమైన ఎమోషన్ లేకపోవడం 'కంగువ'కు మైనస్ గా మారింది.

రొమేనియా సైన్యం కోసం జరిగిన కుట్రలో భాగంగా కంగువ తెగకు చెందిన వంద మందిని మట్టుబెట్టే ఎపిసోడ్.. దానికి హీరో ప్రతీకారం తీర్చుకునే సీన్.. 'కంగువ' మీద అంచనాలు పెంచుతాయి. ఇంట్రోనే ఇలా ఉంటే ఇక అసలు కథలోకి వెళ్తే ఇంకెలా ఉంటుందో అనే ఎగ్జైట్మెంట్ కలుగుతుంది. కానీ ఆ తర్వాత కథ ఆసక్తికరంగా నడవదు. దీని కంటే ముందు వర్తమానంలో నడిచే కథ కొంతసేపే అయినా.. అది ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. కంగువ ఎంట్రీ తర్వాత ఒకదాని తర్వాత ఒకటి భారీ ఎపిసోడ్లు వస్తుంటాయి కానీ.. అవి అంత ఆసక్తి రేకెత్తించవు. విలన్ పాత్రకు మొదట్లో ఇచ్చిన బిల్డప్ కు.. తర్వాత ఆ పాత్ర సాగే తీరుకు పొంతన ఉండదు. ఇక చిన్న పిల్లాడి చుట్టూ చాలా కథను నడిపించారు కానీ.. అది విసుగెత్తించేలా ఉంటుంది. పతాక సన్నివేశాలకు ముందు బిల్డప్ కూడా సరిగా జరగలేదు. మరీ విచిత్రంగా అనిపించే వేషధారణతో.. అతిగా స్పందించే ఆ మనుషులను చూస్తున్నకొద్దీ వికారం పుడుతుంది. అందుకే ఒక దశ దాటాక 'కంగువ' ప్రపంచం చిరాగ్గా అనిపిస్తుంది. ప్రి క్లైమాక్సులో 'కంగువ'కు అవసరమైన బిల్డప్ కనిపించదు. పతాక సన్నివేశాలను భారీగానే తీర్చిదిద్దినా అవి ఆశించిన కిక్కు ఇవ్వలేకపోయాయి. కార్తిని తెరపైకి తీసుకొచ్చి సెకండ్ పార్ట్ కు మంచి లీడే ఇచ్చినా.. పార్ట్-1 మజానివ్వకపోవడంతో దాని మీద అంతగా ఆసక్తి కలగదు. మొత్తంగా చూస్తే నిర్మాతల సహకారంతో సూర్య-శివ కలిసి ఎంతో కష్టపడి ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం చేశారు కానీ.. ఆ ప్రపంచం ఆశించిన వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. సూర్య పెర్ఫామెన్స్.. విజువల్స్ కోసం 'కంగువ'పై ఓ లుక్కేయొచ్చు కానీ.. కొంచెం ఓపిక ఉండాలి.


**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

**నటీనటులు:**

సూర్య ఎలాంటి పెర్ఫార్మర్‌రో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. కంగువ పాత్ర కోసం అతను ప్రాణం పెట్టేశాడు. తన లుక్.. హావభావాలు.. ఓవరాల్ పెర్ఫామెన్స్ అన్నీ సూపరే. తన కళ్లలోని ఇంటెన్సిటీ కంగువ పాత్రను ప్రత్యేకంగా మార్చింది. సూర్యకు గెటప్ బాగా కుదిరింది. తన నటనతో ప్రతి సన్నివేశంలోనూ ప్రేక్షకులను ఎంగేజ్ చేయడానికి ప్రయత్నించాడు సూర్య. కానీ మిగతా ఆర్టిస్టులు తనను మ్యాచ్ చేయలేకపోయారు. బాబీ డియోల్ కు గెటప్ బాగానే కుదిరినా.. తన పాత్ర తేలిపోవడంతో అనుకున్న ఇంపాక్ట్ రాలేదు. బాబీ పెర్ఫామెన్స్ అయితే ఓకే. హీరోయిన్ దిశా పటాని మరోసారి కరివేపాకు టైపు పాత్ర చేసింది. ఒక పాటలో ఆమె గ్లామర్ విందు చేసింది. కమెడియన్లు యోగి బాబు.. రెడిన్ నవ్వులు పంచలేకపోయారు. కథలో కీలకమైన పాత్రలో నటించిన చిన్న పిల్లాడు బాగానే చేశాడు. నటరాజన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్య పాత్రలో రాణించాడు. సూర్య తండ్రి పాత్రలో కనిపించిన కేజీఎఫ్ నటుడు ఓకే. కార్తి క్యామియో పాత్రలో కనిపించిన కొన్ని నిమిషాలు అదరగొట్టేశాడు.

**సాంకేతిక వర్గం:**


టెక్నికల్ గా 'కంగువ'లో ఉన్నత ప్రమాణాలు కనిపిస్తాయి. దేవిశ్రీ ప్రసాద్ పాటలు మంచి ఊపునిస్తాయి. మన్నింపు పాట అన్నింట్లోకి ప్రత్యేకంగా అనిపిస్తుంది. మిగతా పాటలు కూడా సినిమాలో బాగానే ఇమిడిపోయాయి. ఆది జ్వాల పాట వినడానికే కాదు.. చూడ్డానికి కూడా బాగుంది. నేపథ్య సంగీతం మాత్రం జస్ట్ ఓకే అనిపిస్తుంజది. కొన్ని చోట్ల గూస్ బంప్స్ ఇచ్చినా.. కొన్ని చోట్ల మామూలుగా అనిపిస్తుంది. వెట్రి పళని స్వామి సినిమాటోగ్రఫీ సూపర్. ఆర్ట్ వర్క్ గొప్పగా ఉంది. విజువల్ ఎఫెక్ట్స్ కూడా ఓకే. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. భారీగా ఖర్చు పెట్టారు. ఐతే రైటర్ కమ్ డైరెక్టర్ శివ కష్టాన్ని తక్కువ చేయలేం కానీ.. అతను ఎంచుకున్న కథ అంత ఎంగేజింగ్‌గా అనిపించదు. నరేషన్ కూడా చాలా గందరగోళంగా.. లౌడ్‌గా సాగింది. కొన్ని ఎపిసోడ్ల వరకు శివ ఎంగేజ్ చేయగలిగాడు కానీ.. ఓవరాల్ గా ఈ కథను.. ఇందులో అతను చూపించిన ప్రపంచాన్ని ప్రేక్షకులు ఓన్ చేసుకునేలా చేయడంలో విఫలమయ్యాడు. గజిబిజిగా.. లౌడ్ గా సాగే తన నరేషన్ సినిమాకు మైనస్ అయింది.



# లెక్కలకందని చదువుల శాస్త్రం!

**ఫలశ్రుతి: సనాతన ధర్మంలో అనాదిగా ఫలశ్రుతి చివరలోనే ఉంటుంది. కలికాలంలో ఫలశ్రుతే ముఖ్యం కాబట్టి ముందుకొచ్చినట్లుంది. ఈ కథ 'పది'కాలాలపాటు 'పది'లంగా పదే పదే చెప్పుకుని పొందాల్సిన ఫలశ్రుతి ఎందుకయ్యిందో చివరిదాకా చదివితే మీకే అర్థమవుతుంది!**

పోతన భాగవతంలో అజామీళోపాఖ్యానం గొప్ప కథ. ఒకానొక సదాచార సంపన్న దంపతులకు లేక లేక అబ్బాయి పుడితే... అజామీళుడు అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచుకుంటారు. అబ్బాయి గారాబంగా పెరిగి పెద్దవాడవుతాడు. అంతే సంప్రదాయ కుటుంబంలో అమ్మాయిని వెతికి పెళ్లి చేస్తారు. అజామీళుడికి ఇల్లు, ఇల్లాలు ఉందంటే ఉంది.. లేదంటే లేదు అన్నట్లు చెడు తిరుగులు అలవాటవుతాయి. ఎప్పుడు ఇంటికి వస్తాడో తెలియదు. సప్తమహా వ్యసనాల్లో మునిగితేలుతూ ఉంటాడు. అతడు చేయని పాపం లేదు. ఒక స్త్రీ వ్యామోహంలో పడి ఆమెతోనే ఉంటూ ఇంటికి రావడమే మానేస్తాడు. భార్య, తల్లిదండ్రులు ఎంతగా చెప్పినా మారడు. కట్టుకున్న భార్య, పిల్లలు ఇక చెప్పి ప్రయోజనం లేదని వదిలేస్తారు.





వావివరుసలు మరచి ప్రవర్తించే అజామీళుడికి దాదాపు పది మందికి పైగా పిల్లలు. ఎనభై ఏళ్ల వయసు మీద పడుతుంది. సుఖవ్యాధులతో పాటు రాని రోగం లేదు. శరీరం పుండై మంచాన పడతాడు. మరి కాసేపట్లో ప్రాణం పోతుందనగా గుమ్మంలో యమభటులు సిద్ధంగా వచ్చి ఉంటారు.. నేరుగా నరకానికి తీసుకెళ్లడానికి. ఈలోపు అజామీళుడు ఏదో గొణగడం మొదలుపెడతాడు. ఒక స్త్రీని, ఆమె కూతురిని కూడా అనుభవించిన అజామీళుడికి అక్కడ కూడా పిల్లలుంటారు. ఆ అక్రమ సంతానంలో చివర పుట్టినవాడి పేరు – నారాయణ. 'నారాయణ! నారాయణ!' అని పలవరిస్తూ ఆ స్త్రీ గుడిసె మంచ మ్మీద తుదిశ్వాస వదులుతాడు.

యమభటులు గుడిసె గుమ్మం లోపల కాలు పెట్టేలోపు విష్ణుదూతలు దిగి వస్తారు. నియమాల ప్రకారం విష్ణు దూతలున్న చోట యమభటులు ఉండడానికి వీల్లేదు.

'స్వాములూ! ఇక్కడికి మీరెందుకొచ్చారు? చిత్రగుప్తులవారి పాపాల చిట్టాలో వీడు చేయని పాపం, నేరం, ఘోరం లేదు. ఆలస్యం చేయకుండా తీసుకెళ్లి.. సలసల కాగే నూనెలో కొన్ని యుగాలు వేయించాలి. మీరు పక్కకు తప్పుకుంటే వీడిని తీసుకెళతాం" అంటారు.

'నారాయణ! నారాయణ!' ఎంతమాట? ఇతడిని వైకుంఠానికి తీసుకెళ్లడానికి మేమొచ్చాము.. పక్కకు తప్పుకోండి' అంటారు.

విష్ణుదూతల మాటలకు తిరుగులేదు కాబట్టి.. యమభటులు పక్కకు తప్పుకుని నమస్కారం పెట్టి వట్టిచేతులతో నరకానికి వెళ్లి జరిగిందంతా యముడికి చెప్తారు.

యముడు విష్ణువు దగ్గర పెద్ద పంచాయితీ పెట్టి.. భవిష్యత్తులో ఇలాంటి విషయాల్లో గందరగోళం లేకుండా స్పష్టత తీసుకుంటాడు. జీవితమంతా నానా పాపాలు చేసినా.. దైవనామస్మరణ చేస్తూ కన్ను మూసినవారిని యమభటులు తాకడానికి వీల్లేదని, వారి పాద ధూళిని తమలపాకు మీద పెట్టుకుని యమభటులు పునీతులు కావాలని హుకుం జారీ చేస్తాడు.

జీవితమంతా పాపాలు చేసినవారు చివరి ఘడియల్లో అయినా ఎట్టి పరిస్థితుల్లో దేవుడిని తలచుకోరని, ఆస్తులు- పంపకాలు, ఐసీయూలో నుంచి లేచి ఇంటికెళ్లే మార్గల్లాంటివి, కోకాపేటలో కొన్న ఇంటి బాల్కనీలో కూర్చుని టీ తాగే ఘడియల్లాంటివే ఆలోచిస్తుంటారని విష్ణువు నమ్మకం. అదే ఆయన ధైర్యం.

నిజానికి సాంకేతికంగా అజామీళుడు వైకుంఠవాసుడైన నారాయణుడిని తలచుకోనేలేదు. వావివరసలు మరచి కన్న సంతానంలో చివరివాడైన నారాయణ అన్న కొడుకు గురించి పలవరిస్తూ పోయాడు. 'ఏ అర్థంలో, ఎవరిని పిలుస్తూ, ఎలా అంటే నాకెందుకు? అది నా పేరే కదా?' అని యముడికి విష్ణువు చాలా స్పష్టంగా చెప్పి ఒప్పించాడు కాబట్టి ఈ విషయంలో మన యుక్తాయుక్త విచక్షణకు, మన సమీక్షలకు విలువ లేదు. విష్ణువాక్యమే వేదం.

ఎగతాళిగా అన్నా, ఆడుకుంటూ అన్నా, పొరపాటున అన్నా, పిల్లల పేర్లుగా పిలిచినా, చివరికి తిట్టుగా అన్నా.. దేవుడి పేరు పలికితే చాలు ఆయన శాశ్వత వైకుంఠ స్థానం ఇస్తాడని చెప్పడానికి పరమ భాగవతోత్తముడు శుకుడు పరీక్షిత్తుకు చెప్పిన భాగవతం కథ ఇది.

అప్పటి నుంచి ఇప్పటి వరకు అజామీళుడిలా నోటితో చెప్పడానికి వీల్లేని నానా పాపాలు చేసి చనిపోవడానికి ఒక్క సెకను ముందు 'నారాయణ' అని నేరుగా వైకుంఠం చేరి విష్ణువు పక్కన ఎంతమంది కూర్చున్నారో మనకు శుకుడు మళ్లీ కనిపించి చెబితే తప్ప లెక్కలు తేలవు. లేదా అలాంటివారి నోట విన్న పరీక్షిత్తులైనా చెబితే తప్ప మనకు తెలియదు.

పురాణకథల్లో పాత్రలన్నీ ప్రతీకలుగా ఉంటాయి. అందులో నుంచి తత్వాన్ని మనం గ్రహించాలి. సారాన్ని పట్టుకోవాలి. నీతిని పిండుకోవాలి. ఎప్పటికప్పుడు మన రోజువారీ వ్యవహారాలకు వాటిని అన్వయించుకోవాలి. అలా ఏడు పగళ్లు, ఏడు రాత్రుళ్లు భాగవతం విని తరించిన పరీక్షిత్తు పాతకథను, ఆధునిక మహారాష్ట్రలో పది పరీక్షలకు అన్వయించుకుంటే పది సెకన్లలోనే మనకు అనంతమైన జ్ఞానం, మోక్షం సిద్ధిస్తాయి.

మహారాష్ట్రలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇకపై సైన్స్, లెక్కల్లో నూటికి ఇరవై మార్కులే వచ్చినా పాస్ అయినట్లే పరిగణించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల ముంగిట మహారాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎస్‌సిఈఆర్‌టి సిఫారసు చేసింది. బహుశా ఎన్నికలయ్యాక వచ్చే ప్రభుత్వం ఏదైనా ఈ సిఫారసును ఆమోదించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

అజామీళుడి విషయంలో విష్ణువు అన్నదే మహారాష్ట్ర ఎస్‌సిఈఆర్‌టీ కూడా అంటున్నట్లుగా ఇక్కడ మనం ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, అలౌకిక, పారమార్థిక, తాత్విక, ప్రతీకాత్మక కోణంలో అన్వయించుకోవాలి.


పిల్లలు చదివితే ఏమి? చదవకపోతే ఏమి? లెక్కలు, సైన్స్ పుస్తకాలు తెరిస్తే ఏమి? తెరవకపోతే ఏమి? ఒక్క ముక్క వస్తే ఏమి? రాకపోతే ఏమి? ఎన్నో వ్యయప్రయాసలకోర్చి.. లోకాన్ని క్షమించి వారొచ్చి పరీక్ష హాల్లో కూర్చున్నందుకైనా పాస్ చేయాలి కదా? ప్రశ్నపత్రం తీసుకున్నందుకైనా పాస్ చేయాలి కదా? ఆన్సర్ షీట్లో ఏదో ఒకటి రాసినందుకైనా పాస్ చేయాలి కదా?

నూటికి ముప్పయ్ అయిదు మార్కులొస్తేనే పాస్ ఏమిటి? ప్రజాస్వామిక దేశంలో ఇదెంత తలదించుకునే విషయం? ఏం? లెక్కలు, సైన్సులో నూటికి ఇరవై వస్తే చాలదా? కుదరదంటే చెప్పండి పదికి తగ్గిస్తాం. ఇంకా కష్టమంటారా? అయిదు? ఓకేనా! అది కూడా కష్టమా? సరే.. పరీక్ష హాల్‌కు వచ్చి వెళ్లమనండి. పాస్ చేస్తాము. ఇప్పుడు ఓకేనా? ఆ గట్టెక్కిన మహాభాగవత పురాణ అజామీళుడు నవ్వుకుంటున్నాడు.. ఈ ఆధునిక మహారాష్ట్ర పది గట్టెక్కించే బాగోతాన్ని చూసి!

**భరత వాక్యం:-**

**పది వైతరణి గట్టెక్కే ఈ గ్రేస్ మార్కుల విద్యా పరిశోధన మండలి సిఫారసు కరుణ ఆధునిక పరీక్షల ప్రహసన నాటకంలో కేవలం నాందీవాచకమే. పరీక్షలకే తెరపడే భరతవాక్యం ఎంతో దూరంలో లేదు. చదివినవారిని శిక్షించి.. చదవని వారిని రక్షించాల్సిన ఎనిమిది కాళ్ల కలిధర్మంలో రాయని పరీక్షలన్నీ పాసయి.. రాసిన పరీక్షలే ఫెయిలవుతాయి!**

**- పమిడికాల్వ మధుసూదన్**



SSC maths, science passing marks to come down to 20


Ardhra.Nair@timesofindia.com
Courtesy: Times of India

Pune: In a relief for SSC students struggling with maths and science, Maharashtra govt has decided to reduce the minimum passing marks required in the subjects to 20 out of 100, from 35 at present, in its new school curriculum framework. There is a catch, though. Students will be marked as 'passed' on their mark sheets and a special note will indicate that they cannot pursue maths or science courses. The move is aimed at helping students interested in pursuing humanities and arts who may otherwise drop out if they fail in Std 10.

▸ 'Not this year', P 3

VJTI, Ruia tie up to offer more electives

In a first-of-its-kind initiative in Mumbai, leading institutes Veermata Jijabai Technological Institute (VJTI) and Ramnarain Ruia College have collaborated to offer their students elective courses from outside their domain. While Ruia students will learn Basic AI and Machine Learning in VJTI, the engineering students can take lessons in Critical Thinking from Ruia, reports Yogita Rao. Ruia also plans to tie up with the Institute of Chemical Technology to offer its students Economics and ICT students Nutrition. P6



కుంచాల కురమయ్యపేటలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే భక్తులు శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బచ్చు నరసింగరెడ్డి పర్యవేక్షణలో ఈ పూజలు జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు భాలభాస్కర్‌శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


**- సత్యంన్యూస్, ఎచ్చెర్ల**


## ఐఈఐ ఈసీ మెంబర్‌గా
# ముని శ్రీనివాసరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఆర్గనైజేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఈఐ)కు 2024-26కు కౌన్సిల్ ఎలక్షన్స్ జరగగా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిటీకి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 8 మంది పోటీ పడ్డారు. అందులో విజయవాడకు చెందిన ఇంజినీర్ వి.రామకృష్ణప్రసాద్, శ్రీకాకుళానికి చెందిన ఇంజినీర్ ముని శ్రీనివాసరావు, కడప నుంచి ఇంజినీర్ ఏ.వెంకటేశ్వర్లు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికల్లో గెలిచారు. వీరు 2024 నుంచి 2026 వరకు రెండేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిటీ ఈసీ మెంబర్స్‌గా వ్యవహరిస్తారు. కాగా వైజాగ్‌కు చెందిన కే.ఎన్.ఎస్.ప్రకాశరావు ఆంధ్రప్రదేశ్ నుంచి నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈయన నాలుగేళ్లపాటు కౌన్సిల్ మెంబెర్‌గా వ్యవహరిస్తారు.



## అమెరికా పౌరసత్వం పొందిన
# తొలి భారతీయుడెవరు?

శారీరక, మానసిక శ్రమను మాత్రమే నమ్ముకొని ప్రపంచం నలుమూలలకు వెళ్లి జీవించే ధైర్యం, స్ఫూర్తిని ఇచ్చిన గొప్ప విశ్వ మానవుడు గురు నానక్ దేవ్ 555వ జయంతి ఈరోజు. ప్రస్తుతం పాకిస్తాన్ పాలనలోని భూభాగం రాయ్ భోయ్ దీ తల్వాండీలో ఐదున్నర శతాబ్దాల ఐదేళ్ల క్రితం అదీ కార్తిక పౌర్ణం రోజు జన్మించాడు నానక్.


పంజాబీ హిందూ ఖత్రీ కుటుంబంలో పుట్టారు గురు నానక్. ఆయన తర్వాత సిక్కు ధర్మానికి గురువులైన మిగిలిన తొమ్మిది మందీ కూడా హిందూ ఖత్రీ కుటుంబాల్లో పుట్టడం యాదృచ్ఛికం అంటారు. సిక్కులు ఆచరించే భౌతికపరమైన (వేషభాషలు) పద్ధతులు ఏవీ నానక్ దేవ్ నిర్దేశించినవి కావు. చివరి, పదో గురువు గురు గోవింద్ సింగ్ ఈ నియమాలు రూపొందించి వాటిని కట్టుదిట్టంగా అనుసరించాలని ఆదేశించారు. గురునానక్‌ను ప్రథమ పంజాబీ కవిగా భారత పంజాబీలే గాక పాకిస్తాన్లో అంతర్భాగమైన పెద్ద పంజాబ్‌లోని ముస్లిం పంజాబీలు సైతం పరిగణించి గౌరవిస్తారు.

పాక్ పంజాబ్ నగరం లాహోర్‌కి చెందిన విద్యావేత్త, రచయిత హరూన్ ఖలీద్ ఇంగ్లిష్ వ్యాసాలు చదివాక నేను బాబా గురు నానక్ దేవ్ గురించి సాధ్యమైనంత ఎక్కువ తెలుసుకున్నాను. గురు నానక్ బతికి ఉండగా ఆసియా ప్రాంతమంతా (తెలుగు ప్రాంతాలు సహా) పర్యటించారు. ఆయన తిరిగిన అన్ని ఊళ్లు, నగరాలకు వెళ్లిన హారూన్ ఖలీద్ ఇంగ్లిష్‌లో వాకింగ్ విత్ నానక్ అనే గొప్ప పుస్తకం రాశారు.

ఇంకా ప్రస్తుత పాకిస్తాన్ ప్రాంతాలైన పంజాబ్, సింధ్, బలోచిస్తాన్, ఖైబర్ ఫఖతున్ఖ్వా పావిన్సుల్లో స్థానిక ముస్లింలు ఆచరించే హిందూ ఆచారాలు, నమ్మకాలను వివరిస్తూ ఆయన్ కొన్నేళ్ల క్రితం ఇన్ సెర్చ్ ఆఫ్ శివ అనే గ్రంథం కూడా రాశారు. మొత్తమ్మీద హరూన్ ఖలీద్ అనే ప్రగతిశీల ముస్లిం మేధావి, ఆంత్రోపాలజిస్ట్ రచనలు చదివి నానక్ గురించి నేను కాస్త తెలుసుకోవడం ఆనందంగా ఉంది. సిక్కు ధర్మంలో చేరకుండా నానక్ బోధనలు అభిమానించే నానక్ పంథీలు అనే మతవర్గం ఉత్తరాదిన ఉంది. ఇంకా జీవించి ఉన్న బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ (97) కూడా నానక్ పంథీయే. అద్వానీ కొడుకు, పిల్లల పెళ్లిళ్లు కూడా ఢిల్లీ గురుద్వారాలో జరిగాయి.

అగ్రరాజ్యం అమెరికాలో అక్కడి పౌరసత్వం పొందిన (1918లో) ప్రథమ భారతీయుడు లేదా భారత సంతతి వ్యక్తి పంజాబీ సిక్కు (భగత్ సింగ్ థిన్ద్) కావడం అనేది గురునానక్ బోధనల వల్లే సాధ్యమైందనుకోవాలి. అమెరికా పౌరసత్వం కోసం అక్కడి అత్యున్నత కోర్టులో సుదీర్ఘ న్యాయపోరాటం చేసి విజయం సాధించాడు భగత్ సింగ్ థిన్ద్.

**- రమణ కొంటికర్ల**



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 22న పినకాన 8వ వర్థంతి

(సత్యంన్యూస్, టెక్కలి)

సిపిఎం సీనియర్ నాయకుడు పినకాన క్రిష్ణమూర్తి 8వ వర్థంతి సభ నందిగాం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఈ నెల 22న జరుగుతుందని నంబూరు షణ్ముఖరావు తెలిపారు. శనివారం విలేక రులతో మాట్లాడుతూ మొదట స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించి, అనంతరం తన అధ్యక్షతన సభ జరుగుతుందని, ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి క్రిష్ణమూర్తి, కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు పోలాకి ప్రసాదరావు, హెచ్.ఈశ్వరరావు, కొల్లి యల్లయ్య, పి.సాంబమూర్తి, బగాది వాసుదేవరావు, న్యాయవాది పిన కాన అజయ్ కుమార్, రైతు సంఘం, గిరిజన సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు.



# గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల సందర్భంగా శనివారం గ్రంథాలయాధికారి ఉగ్ర సేను ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథు లుగా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యా యులు ఎన్.సుబ్రహ్మణ్యం, నేషనల్ అవుట్ స్టాండింగ్స్ సైన్స్ అవార్డు గ్రహీత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు అన్నెపు పుల్లయ్య మాట్లాడు తూ వారి ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆరోగ్యశ్రీ చైర్మన్‌గా సీతంరాజు సుధాకర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, జెఎన్టీయూ పాల కమండలి సభ్యుడు డాక్టర్ బుడు మూరు రాజేష్ శనివారం నాడు విశాఖపట్నంలో కలిశారు.
– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

# అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనను విధిగా పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని శ్రీకా కుళం డిఎస్పీ వివేకానంద అన్నారు. ప్రపంచ రోడ్డు ప్రమాద బాధి తుల జ్ఞాపక దినం సందర్భంగా స్థానిక రెడ్ క్రాస్ భవనంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేవారు జాగ్రత్త వహించకపోతే అదే రోడ్డుపై ఎంతో జాగ్రత్తగా ప్రయాణించే వారికి సైతం ప్రమాదం జరుగుతుందని, ఎదుటవారి ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు వాహనాలు నడపాలన్నారు. గంజాయి, మద్యం మత్తు పదార్థాలకు యువతరం దూరంగా ఉండడంతోపాటు గంజాయి అమ్మకాలు ఎక్కడ సాగినా ఆ సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావా లన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను వినియోగం, అమ్మకాలు సాగించే వారి వివరాలు తెలియజేస్తే వారి పేర్లు తాము గోప్యంగా ఉంచు తామన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రమా దాలు జరిగేటప్పుడు ప్రాణాలు కాపాడేందుకు అందుబాటులో ఉండే వ్యక్తులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ వానపల్లి నాగరాజు టూటౌన్ సిఐ ఈశ్వరరావు జి.రమణ, మేనేజింగ్ డాక్టర్ నిక్కు అప్పన్న, కళ్యాణ చక్రవర్తి, చిన్మయరావు, నరసింగరావు, గుణాకరరావు, కొంక్యాన వేణుగోపాల్, పెంకి చైతన్యకుమార్, నంది ఉమాశంకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## నిలదీసే వారిపై నిర్బంద కాండ

(సత్యంన్యూస్, పాతపట్నం)

అబద్ధపు హామీలు ఇచ్చినంత సులువుగా వాటిని అమలు చేయడం సాధ్యం కాదని, అందుకే కూటమి పాలనా వైఫల్యాలపై గళమెత్తితే పోలీసు లను ఉసిగొలుపుతున్నారని పాతపట్నం మాజీ ఎమ్మె ల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే వాళ్ల లేకుండా చేద్దామని చంద్రబాబు ఫిక్స్ అయ్యారని, అందుకే వైకాపా సోషల్ మీడియా వారియర్స్‌ను అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఇది రెడ్‌బుక్ రాజ్యాంగ అజెండానా అని ఆమె ప్రశ్నిం చారు. టెక్నాలజీని తానే కనిపెట్టానని చెప్పుకునే చంద్రబాబునాయుడు ఇప్పుడు సోషల్ మీడియా పేరు చెబితేనే వణికిపోతున్నారని, ఆయనకు నిద్రలేని రాత్రులు పరిచయం చేసిన సోషల్ మీడి యా సైనికులు మున్ముందు ఆయనకు బుద్ధి చెప్ప డం ఖాయమన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయ మంటే జైల్లో పెడుతున్నారని, చేతకాని హామీలు ఇవ్వడం ఎందుకని రెడ్డి శాంతి ప్రశ్నించారు. అన్ని వర్గా లను మోసం చేసిన చంద్రబాబు ప్రజాకోర్టులో శిక్షకు సిద్ధంగా ఉండాలన్నారు.

# డబ్బులిస్తే కుచ్‌బీ 'హోతా'

(మొదటిపేజీ తరువాయి)

లారీలకు లోడ్ చేసి తరలించుకుపోతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరు ప్రభుత్వానికి రూ.5లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి ఇసుక తవ్వకాలకు అనుమతి తెచ్చుకున్నట్టు రూ.100 స్టాంప్ పేపర్‌పై ఒక ప్రొసీడింగ్స్ తీసుకొచ్చి యంత్రాలతో లారీల్లోకి ఎత్తి తరలిస్తున్నారు. ర్యాంపు భౌగోళిక అక్షాంశ, రేఖాంశాలను కలెక్ట రేట్ వద్ద చూపించి ఇసుక తవ్వకాలను మాత్రం కిల్లిపాలెం వద్ద చేస్తు న్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత నెల 30న జారీ చేసినట్లు చూపిస్తున్న ప్రొసీడింగ్స్‌లో ఈ నెల 7 నుంచి 14 రోజులు పాటు ఈ నెల 20 వరకు ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చినట్టు ఉంది.


ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని పోరాటం చేస్తున్న టీడీపీ కార్య కర్తలను సొంత పార్టీ నాయకులే బెదిరిస్తున్నారని బాధితులు వాపోతు న్నారు. ఇక్కడ ఇసుక తవ్వకాల వల్ల తాగునీరు కలుషితమై సమీప గ్రామంలో ప్రజలు వ్యాధుల బారిన పడ్డారని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కిల్లిపాలెం గ్రామంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయని, లభ్యమవుతున్న గ్రౌండ్ వాటర్‌లో గాఢత, కాఠిణ్యత పెరిగి ఆక్సిజన్, పిహెచ్ లెవల్స్ పూర్తిగా తగ్గిపోయాయని సంబంధిత శాఖ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా ఇసుక ర్యాంపునకు అనుమతివ్వడంపై గ్రామస్తులు మండిప డుతున్నారు. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ సందర్శించి గ్రామంలో పరిస్థితిని, తాగునీటి సమస్యను పరిశీలించారు. ఉన్నతా ధికారులు, మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంపై గ్రామానికి చెందిన పలువురు స్వచ్ఛంద సేవకులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్ర యించారు. జనసేన అధినేత, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించడానికి కొందరు యువకులు సన్నద్ధమవుతున్నారు. కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ అధికారులు, నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారికి గ్రామస్తులు నోటీసులు పంపించారు.

# అటవీ భూములను డీనోటిఫై చేసి ఆదుకోవాలి

- అరసవల్లి రథసప్తమిని ప్రభుత్వ పండుగగా గుర్తించాలి
- రెవెన్యూ మంత్రి, దేవదాయశాఖ ప్రిన్సిపాల్‌ను కోరిన ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార మండలం మొగదాలపాడు గ్రామంలో భూములు గతంలో అటవీ భూములుగా ప్రభుత్వ రికార్డు అయి ఉన్నాయని, వాటిని డీ నోటిఫై చేసి గ్రామస్తులు వారి భూములను అమ్మకాలు, కొనుగోలు చేసుకు నేలా ఉత్తర్వులు కల్పించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసా ద్‌ను కోరుతూ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వినతి పత్రం అందజేశారు. ఈమేరకు శుక్రవారం సచివాలయంలోని రెవెన్యూమంత్రి చాంబర్‌లో ఆయనను కలుసుకొని వినతిని అందజేశారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తమ భూములు అటవీశాఖ భూములు గా రికార్డుల్లో నమోదై ఉండడంతో ఈ భూములపై తమ హక్కును కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. వారు అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే శంకర్ రెవెన్యూమంత్రికి వినతిని అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రత్యక్ష నారాయణుడు అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను ప్రభుత్వ పండుగగా గుర్తించాలని కోరుతూ కోరుతూ దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని, ఎండోమెంట్స్ కమిషనర్‌ను కలిసి ఎమ్మె ల్యే శంకర్ వినతి పత్రం అందజేశారు.



# సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కిరణ్

(సత్యంన్యూస్, రణస్థలం)

సూరంపేట గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయ 3వ వార్షికో త్సవంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా బాబాకు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగ్గురోతు అప్పలనా యుడు, డీలర్ గుడివాడ సూర్యనారాయణ, జగ్గురోతు శ్రీనివాసరావు, జగ్గురోతు రమణ, లంక శ్రీరాములు, యండవ అప్పల నాయుడు, అసిరితల్లి, యువత తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయ ఉద్యమానికి వారి కృషి ఎనలేనిది

(సత్యంన్యూస్, లావేరు)

గ్రంథాలయ ఉద్యమానికి ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూ షణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల కృషి ఎనలేనిదని లావేరు పోస్టుమాస్టర్ ఎ.లక్ష్మి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో ఉద్యమకారుల చిత్రపటాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయ ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయా నికి వెళ్లి పుస్తక పఠనం చేయాలని, తద్వారా ఏకాగ్రత వస్తుందన్నా రు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 20 వరకు వారోత్సవాలు జరుగుతాయని, వివిధ పోటీలు నిర్వ హించి విజేతలకు ఆరోజు బహుమతులను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ తెలుగు పండితులు శ్రీనివాసరావు, గ్రంథా లయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మంత్రులను కలిసిన సుడా చైర్మన్






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడలోని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సుడా చైర్మన్ కె.రవికుమార్ కలి శారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేశారు. ఈయనతో పాటు జనసేన ప్రతినిధి గేదెల చైతన్య, సురవరం రవీంద్ర, శివ్వాల సాయి బాబు ఉన్నారు.

# వైభవం.. దేవదేవుని కళ్యాణం..!

(సత్యంన్యూస్, లావేరు)

దేవదేవుని కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. గోవింద నామా లతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కళ్యాణ వైభవం తిలకించి భక్తజనం పులకించిపోయారు. మురపాక వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ధర్మకర్తలు జల్లే పల్లి గిరిధరరావు, శ్రీధరరావు దంపతులు, కుటుంబీకులు పర్యవేక్ష ణలో అర్చక ప్రతినిధులు రేజేటి రామారావు, శ్రీనివాసాచార్యుల బృందం ఆధ్వర్యంలో కలియుగ దైవం కళ్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మురపాకతో పాటు పీబీ నగర్ కాలనీ, గుంటుకు పేట, ఆరంగిపేట గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, అయ్యప్ప, భవానీ మాలధారులు శ్రీనివాసుని కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తలు జల్లేపల్లి గిరిధరరావు, శ్రీధ రరావు సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గిరిధరరావు మాట్లాడుతూ ఈ ఆలయంలో ప్రతి ఏటా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళ్యాణోత్సవానికి డిప్యూటీ కలెక్టర్ జల్లేపల్లి మాధవి తన కుమార్తె జన్మదినం పురస్కరించుకొని



రూ.10వేలు విరాళం అందజేయగా, స్థానిక భక్తులు తల్లూరి మధు పువ్వులు, అన్నదానానికి వండాన సురేష్ కూరగాయలు, వడ్డి గణేష్ పెరుగుతో పాటు పలువురు దాతలు సహకరించారు. కళ్యాణోత్సవం అనంతరం 5వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు జల్లేపల్లి కేశవరావు, జల్లేపల్లి జనార్ధన రావు, మడ్డి కనకయ్య, డాక్టర్ బాబీ, నాగులపల్లి కృష్ణ, లక్ష్మణరావు, ప్రభాకరరావు, మణిబాబు, రొంపివలస మల్లేశ్వరరావు, రాజు, మధు, సూరీడమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను మానసికంగా బలోపేతం చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాలికలను మానసికంగా బలోపేతం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శనివారం అంబేద్కర్ ఆడిటోరి యంలో ప్రారంభమైన కిషోరి వికాసం శిక్షణ తరగతుల్లో పీడీ శాంతిశ్రీ ముందుగా పవర్ పాయింట్ ప్రేజెంటేష్ ద్వారా కిషోర బాలలందరికీ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, బాల్య వివా హాల వల్ల జరిగే అనర్థాలు, బాలల అక్రమరవాణా, బాలలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందినవారితో జిల్లాలో సంబంధిత శాఖల అధికా రులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మండల స్థాయి అధికారు లందరూ గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించి గ్రామంలో ప్రతి ఒక్క బాలికకు ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన 6 శాఖలకు చెందిన అధికారులు మండల, గ్రామ స్థాయిలో ఫంక్షనరీస్ అందరికీ శిక్షణ ఇస్తారని, గ్రామస్థాయిలో కౌమార బాలికలను గుర్తిం చి, వారిని బృందాలుగా చేసి వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందుకు సంబంధిత శాఖల సమ న్వయం అవసరమన్నారు. సింగుపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లిల్లీ మాట్లాడుతూ కిషోర్ బాలికా వికాసంపై గుంటూరులో శిక్షణ తీసుకున్నామని, ఆహారం తీసుకునే ముందు, తర్వాత ప్రతి ఒక్కరు చేతులు శుభ్రపర్చుకోవాలని, ప్రతీ బాలిక రక్తహీనతకు గురి కాకుండా బలమైన ఆహారం తీసుకోవాలన్నారు.

డీసీఈవో ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాల శాతం భారతదేశ సగటు కన్నా ఎక్కువగా ఉందని, దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూల నకు కిశోరి వికాసం కార్యక్రమాన్ని పునః ప్రారంభించడం అభినం దనీయమన్నారు. మహిళా మార్గదర్శి ఎన్జీవో శ్రీనివాస్, విద్యా ఫౌండే షన్ ఎన్జీవో యు.ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, బాలికల రక్షణ కు తమ సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ కలసి గ్రామాల్లో, పాఠ శాలల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. స్కూల్ ఆఫ్ టైక్వాండో శ్రీను శిష్యులు జాస్మిన్, వంశీ బృందం బాలికలు ఆత్మ రక్షణకు సంబంధించిన మెలుకువలు ప్రదర్శించారు. శిక్షణ తరగతు లకు జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ డీసీపీవో కె.వి.రమణ, ఎస్.నీరజ, టి.సుజాత, జిల్లాలో 30 మండలాల నుంచి మెడికల్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల లెక్చరర్స్, ఈవోపీఆర్‌డీలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా మార్గదర్శి ఎన్జీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆసక్తి ఉన్న రంగంలో చిత్తశుద్ధితో శ్రమించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తల్లిదండ్రులు ఒత్తిడి చేశారని కాకుండా ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థానాలకు వెళ్లేలా ప్రణాళికలు వేసుకుని చిత్తశుద్ధితో శ్రమించాలని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమయపాలన, మాట తీరు, సర్దుకుపోవడం, పెద్దలను గౌరవించడం, పరిశుభ్రత తదితర అంశాలలో ఉత్తమంగా నిలిచిన 13మంది విద్యార్థులను ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చిన్న చిన్న తప్పులను సరిదిద్దేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దండించడం సహజమని, దాని అవసరం పెద్దయ్యాక మనకు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ కరెస్పాండెంట్ ఎ.రమేష్‌బాబు, ప్రిన్సిపల్ కిరణ్‌కుమా ర్, కోఆర్డినేటర్లు నిరోషా, దేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

అరిణాం అక్కివలస గ్రామంలో రూ.3లక్షల అంచనా వ్యయంతో మండల పరిషత్ నిధుల నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మండల పరిషత్ అధ్యక్షులు మొదలవలస చిరంజీవి శంకుస్థాపన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు మంజూరుచేసి గ్రామాల్లో పనులు ప్రారంభించామని, పనులను క్వాలి టీ, క్వాంటిటీతో తొందరగా పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు మాడుగుల మురళీధర బాబా, అరిణాం అక్కివలస సర్పంచ్ అంబటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అంబటి సుజాత, వైకాపా నాయకులు గొలివి రామకృష్ణ, దిలీప్ కుమార్, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.